క్లుప్తంగా

ఆహార పొట్లాలు, మొక్కల పంపిణీ



ఆహార పొట్లాలు అందిస్తున్న చిత్తా రామారావు, శోభారాణి

అగనంపూడి: బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం చేపడుతున్న సేవా కార్యక్రమం కొనసాగించారు.దీనిలో భాగంగా మంగళవారం మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తారావు, బొర్రమాంబ పారాయణ సేవా సమితి కార్యదర్శి శోభారాణి దంపతుల ఆధ్వర్యంలో అనాథలు, యాచకులకు ఆహార పొట్లాలు అందించారు. అలాగే పారాయణ సేవా సమితి ప్రతినిధులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులోని పకీర్ తక్యాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అవసరమైన పనులు చేపడుతున్నామని పల్లా పేర్కొన్నారు. వార్డులో మురుగు కాలువలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.2.80 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటేశ్వరరావు, నారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాక్‌థాన్



విజేతలకు చెక్‌లు అందిస్తున్న ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు

అగనంపూడి: కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి బహుమతిని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ద్వితీయ బహుమతిని నగరంలోని గాయత్రి కళాశాల, తృతీయ బహుమతిని విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలు దక్కించుకున్నాయి. వీరికి నగదు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ విద్యార్థులు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడిందన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో విశ్వకర్మ జయంతి

ఉక్కునగరం: విశ్వకర్మ జయంతిని బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ విశ్వకర్మ పూజా కమిటీ ప్రతినిధులు తెలిపారు. సెక్టార్–5 లోని మరిడిమాంబ ఆలయం ఎదరుగా ఉన్న విశ్వకర్మ మండపం వద్ద ఉదయం నిర్వహించనున్న ప్రత్యేక పూజల్లో స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఎ.కె. సక్సేనా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) డాక్టర్ ఎస్. కరుణ రాజు, డైరెక్టర్లు ఎ.కె. బాగ్చీ, ఎస్.సి. పాండే, జి.వి.ఎన్. ప్రసాద్, సలీం పురుషోత్తమన్‌లు హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు హాజరు కావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏజ్ ఈజ్ జస్ట్... నంబర్

వృద్ధాప్యం శరీరానికే.. మనస్సుకు కాదు



టోపీ అల్లుతున్న పేరి వెంకట సుబ్బలక్ష్మి

ఏజ్ ఈజ్ జస్ట్.. నంబర్!!
అవును మీరు చదువుతున్నది నిజమే..!!

సంకల్పం... కార్యదక్షత ఉంటే వయసుతో పని లేదని ఆమె నిరూపిస్తోంది. పట్టుదలతో చేస్తే వృద్ధాప్యం శరీరానికే కాని మనసుకు కాదని చాటి చెబుతోంది. ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది వడ్లపూడికి చెందిన బామ్మ. వందేళ్లు దగ్గర పడుతున్నా విసుగు లేకుండా తన పనులు చేసుకుంటూనే అలవాటుగా మారిన వృత్తులను కొనసాగిస్తున్నారు పేరి వెంకటసుబ్బలక్ష్మి. సుమారు 94 ఏళ్లు పైబడినా ఎవరి సహాయం లేకుండానే అల్లికలు అల్లుతూ అందరి మన్ననలు అందుకొంటున్నారు. ఆమె కుంచె నుంచి రకరకాల చిత్రాలకు జీవం పోస్తున్నారు. – కూర్మన్నపాలెం



చిత్రాలు గీస్తున్న బామ్మ

జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి కణితికాలనీలో నివాసముంటున్న పేరి వెంకటసుబ్బలక్ష్మి ఇష్టంతోనే అనేక వృత్తుల్లో ప్రావీణ్యం సాధించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మరో వైపు నేర్చుకున్న వృత్తుల్లో రాణించారు. అందు వల్లే 94 ఏళ్ల వయసులో కూడా క్షణం కూడా ఖాళీగా కూర్చోకుండా పని చేస్తున్నారు.

ఆమె కుంచె అద్భుతం

శీతాకాలం వస్తే స్వెట్టర్లు అల్లుతారు. ఇక పండగలు, ఇతర శుభకార్యాల సమయంలో కుటుంబ సభ్యులందరికీ ఆమే వస్త్రాలు కుడతారు. అనేక రకాల చిత్రాలు గీస్తూ వాటిపై ఉన్న మక్కువను తేటతెల్లం చేస్తున్నారు. అంతేందుకు ఈ వయస్సులో కూడా ఆమెను ఎవరైనా పలకరించడానికి వస్తే వారిని కూర్చోబెట్టి వారి రూపాన్ని అక్కడికక్కడే గీసి అందించడం ఆమె ప్రత్యేకత. ఇప్పటికే ఆమె గౌతమబుద్ధుడు, అల్లూరి సీతారామరాజు, నన్నయ, తిక్కన, స్వామి వివేకానంద, రామదాస్, త్యాగరాజు, రామానుజాచార్యులు, కాళిదాస్ వంటి ఎంతోమంది మహనీయుల చిత్రాలను గీసి ప్రసిద్ధి కెక్కారు.

అందరికీ దగ్గర.. ఆడంబరాలకు దూరం

పూర్వం విషయాలు తెలుసుకోవాలంటే చుట్టుపక్కల కాలనీ వాసులు ఆమె దగ్గరకు వెళ్లి అడగవలసిందే. అయితే ఆమె సన్మానాలు, అవార్డులకు దూరంగా ఉంటారు. ప్రతికళలో ప్రావీణ్యం ఉండాలన్న దృక్పథంతో నేర్చుకున్నానని ఆమె చెబుతారు. సంగీతంపై కూడా మక్కువ ఉన్నప్పటికీ నేర్చుకోవడానికి వీలు దొరకలేదని తెలిపారు. ఆ కోరిక తీర్చుకొనేందుకు తన మనుమరాలికి సంగీతం నేర్పించి ఆ తర్వాత కణితికాలనీలోనే నృత్య పాఠశాలను కూడా నెలకొల్పారు. ఈ వయసులో కూడా పట్టుదలతో పని చేస్తున్న సుబ్బలక్ష్మి నేటి తరానికి ఆదర్శప్రాయురాలు అంటే అతిశయోక్తి కాదు.

ఉద్యోగం కోసం వచ్చి కణితిలో నివాసం





ప్రస్తుత విజయనగరం జిల్లాలోని పెదనందిపల్లిలో జన్మించిన వెంకటసుబ్బలక్ష్మి ఉద్యోగరీత్యా 1956లో కణితికి వచ్చారు. అప్పటినుంచి ఉద్యోగంలో బదిలీలు ఉన్నప్పటికీ కణితి నుంచి నివాసం మార్చుకోలేదు. ఉక్కుకర్మాగారం నిర్మాణంలో ఇళ్లు కోల్పోవడంతో తర్వాత నిర్వాసితకాలనీకి చేరుకున్నారు. 1989లో వీడీఏగా పదవీ విరమణ పొందిన ఆమె కుటుంబ సభ్యులతో కణితిలో ఉంటూ ఇలా రకరకాల కాలక్షేపాలతో ప్రజలకు దగ్గరయ్యారు.



నటనలోనూ ప్రావీణ్యం

వెంకటసుబ్బలక్ష్మి జానపద నాటకాలు రాయడం, నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహించారు. ఇప్పటికీ పుస్తకాలు ముందు పెట్టుకొని ఏదో ఒకటి చదువుతూనే ఉంటారు. ఇలా అన్ని రంగాల్లో రాణిస్తున్న వెంకటసుబ్బలక్ష్మి మామ్మ అంటే ఉక్కు నిర్వాసిత కాలనీల్లో అంతా ఎంతో గౌరవంగా చూస్తారు.

అన్నీ ఇష్టంతో నేర్చుకున్నా..

చిన్నతనంలోనే భర్తను కోల్పోయాను. అయినా ఒక వైపు ఉద్యోగబాధ్యతలు, మరో వైపు చిన్నపిల్లలతో ఉంటూనే కుట్లు, అల్లికలు నేర్చుకున్నాను. ఆ తర్వాత బొమ్మలు గీయడం నాకునేనుగానే వేస్తూ అనేక మంది మహనీయుల చిత్రాలను గీశాను. పదవీ విరమణ పొందిన తర్వాత పనులు చేసుకొంటూ అల్లికలు కుట్లు కొనసాగిస్తున్నాను. కొడుకులు కాలం చేయడంతో మనుమరాల వద్ద ఉంటున్నాను. బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఏమీ లేవు. హ్యాపీగానే ఉంటున్నాను.

– పేరి వెంకటసుబ్బలక్ష్మి, కణితికాలనీ

బ్యాడ్మింటన్ పోటీల్లో ఉక్కు మాజీ ఉద్యోగి ప్రతిభ



డబుల్స్ పార్టనర్ సుజానే వింగ్‌లెట్‌తో లింగేశ్వరరావు

ఉక్కునగరం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావుకు రజత పతకం లభించింది. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో థాయిలాండ్‌లోని పటాయలో ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2025 నిర్వహించారు. పోటీల్లో 54 దేశాలకు చెందిన 1700 క్రీడాకారులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి 198 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. లింగేశ్వరరావు 55+ కేటగిరీలో సుజానే వింగ్‌లెట్‌తో మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొని లీగ్ పోటీల్లో పలువురిని ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఫైనల్స్‌లో డెన్మార్క్ క్రీడాకారులు సోరెన్‌సేన్, అండర్సన్ జట్టుతో పాల్గొని రన్నరప్‌గా నిలిచారు. లింగేశ్వరరావు గతంలో మూడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సింగిల్స్ అండ్ డబుల్స్‌లో మూడు రజత పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా లింగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తాయి.

కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలని ఫిర్యాదు

గాజువాక: నాతయ్యపాలెం గ్రామానికి సంబంధించిన కృష్ణ మహంతి చెరువు నుంచి వర్షం నీటితో పాటు గ్రామంలో నివాసాల నుంచి వాడుక నీరు పోయేందుకు సంబంధించిన కాలువ ఆక్రమణకు గురవుతోందని నాతయ్యపాలెం గ్రామ పెద్దలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కాలువను పరిరక్షించడం కోసం సర్వే చేయించాలని వినతి పత్రం అందజేశారు. సర్వే అనంతరం రెండు మీటర్ల వెడల్పుతో సీసీ డ్రైన్ నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయించాలని, డెయిరీ ఆస్పత్రి పక్క నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందున్న పెద్ద కాలువకు అనుసంధానం చేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామపెద్దలు గోపిశెట్టి ఆదినారాయణ, సంగ్రాన చినసన్యాసిరావు, గంగ్రెడ్డి రామునాయుడు, గవర రమణ, సంగ్రాన శ్రీను, బోగాది అప్పారావు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



స్వామికి పూజలు చేస్తున్న పండితులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం లక్ష కుంకుమార్చనలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. తర్వాత ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఈకే చారి మాట్లాడుతూ పవిత్రోత్సవాలను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. బుధవారం లక్ష తులసి పూజ ఉంటుందని.. భక్తులు పాల్గొవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళన ఆరో రోజూ కొనసాగింది. ఈ అంశంపై మంగళవారం చేపట్టిన ఆందోళనలో భాగంగా జనరల్ షిఫ్ట్ విధులకు వెళ్లిన ఉద్యోగులను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు ట్రైనింగ్ విభాగం వద్ద ఆందోళన చేశారు. నిర్వాసిత కార్మికులను తిరిగి చేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులను చేర్చుకునే వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, మంత్రి రవి, వంశీకృష్ణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ విభాగం వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు

పోతిన సేవలు మరువలేం

పెదగంట్యాడ: కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, పెందుర్తి ఎమ్మెల్యేగా పోతిన సన్యాసిరావు అందించిన సేవలు మరువలేమని సీపీఐ గాజువాక జోన్ నాయకులు అన్నారు. పోతిన సన్యాసిరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి. ఆనంద్,పెదపూడి దుర్గారావు, పోలయ్య, పోతయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పోతిన సన్యాసిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పందుల స్వైర విహారం



వికాస్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పందుల సంచారం



సీతానగరంలో చెత్తను చిందర చేస్తున్న పందులు

పెదగంట్యాడ: దోమలు, ఈగలతో ఇప్పటికే పలు రోగాలు విజృంభిస్తున్నాయి. వీటికితోడు రోగాలకు వాహకాలైన పందులతో యుద్ధం చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివారు ప్రాంతాల్లో సంచరించే పందులు ఇప్పుడు నేరుగా వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయని మండిపడుతున్నారు. గుంపులు గుంపులుగా జనవాసాల మధ్య సంచరించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మురుగు కాలువలు, చెత్త కుప్పలను ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే వారిపై అకస్మాత్తుగా దాడి చేసి భయాభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జీవీఎంసీ 65,64,76,75,77 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పందుల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోగా ఐటీఐ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు ఈనెల 28 హాజరు కావాలని పేర్కొన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.కార్పెంటర్, టర్నర్ ట్రేడ్‌ల విద్యార్థులకు బుధవారం నుంచి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.

ఆస్పత్రి అభివృద్ధి చేయాలని వినతి

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రి బయట జాతీయ రహదారిని ఆనుకొని డ్రైనేజీ వ్యవస్థ శిథిలమైందని, ఫుట్‌పాత్ కూడా అందుబాటులో లేకపోవడంతో రోగులు, వారి సహాయకులు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని వివరించారు.శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి త్రినాధరావు, డొక్కా రమేష్, కోసూరి తాతారావు, గజ్జల నూకరాజు పాల్గొన్నారు.

జీవకోటికి ఉక్కు కవచం ఓజోన్ పొర



గొడుగులతో ర్యాలీ నిర్వహిస్తున్న లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు



ఓజోన్ పొర ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థుల ప్రదర్శనలు



ఓజోన్ ఆకారంలో లంకెలపాలెం విద్యార్థులు

అగనంపూడి: జీవకోటిని ఓజోన్ పొర ఉక్కు కవచంలా కాపాడుతుందని, దాన్ని కాపాడుకోకపోతే మానవ మనుగడ కష్టంగా మారుతుందని లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర వల్ల సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరకుండా కాపాడుతుందని చెప్పారు. కాలుష్యం, మనిషి వికృత చేష్టల వల్ల ప్రకృతి ప్రకోపానికి గురవడంతో ఓజోన్ పొర దెబ్బతింటే మనిషి జీవనం కష్టమన్నారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎపీఎస్‌జీసీ గ్రీన్ టీచర్లు పాల్గొన్నారు.

ఎంవీఆర్‌లో..

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొరను రక్షించుకోవడం కోసం విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్, మోడల్ ప్రెజెంటేషన్ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ ఆవశ్యకతను, జన్యుపరమైన సమస్యను వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు , అధ్యాపకులు వై.ఈశ్వరరాజు, సుజాత, సౌజన్య పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో సేవా పక్షోత్సవాలను నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. బుధవారం నుంచి వచ్చేనెల 2 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. బుధవారం ఉదయం పాతగాజువాకలో మెగా వైద్య శిబిరంతో సేవా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విజయంతం చేయాలని కోరారు.

అదానీ సంస్థకు భూకేటాయింపులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: పెదగంట్యాడలో అదానీ గంగవరం గ్రేడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూకేటాయింపులు, అనుమతులు రద్దు చేయాలని, జనావాసాలకు దూరంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి సిటు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం సర్వే నంబరు 97(పి), 98(పి), 99(పి), 101(పి)లో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ అంబుజా సిమెంట్స్‌కు గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ ఏర్పాటుకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. అందుకు సంబంధించి వచ్చే నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసిందన్నారు. సాగరతీరం, స్టీల్‌ప్లాంట్, జనావాసాలకు మధ్య ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల పెదగంట్యాడ, గాజువాక, గంగవరం, మల్కాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 12 లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు, జీవరాశులకు హానీ జరుగుతుందని చెప్పారు. ఈ పరిశ్రమ వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. భారీ వాహన రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాణనష్టం అధికమవుతుందని చెప్పారు. కేవలం 60 పర్మినెంట్, 200 మందికి కాంట్రాక్ట్ ఉపాధి మాత్రమే లభిస్తుందని, అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీ లేదన్నారు.